


పైడిమెట్ట అభివృద్ధికి తక్షణ చర్యలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని 4 గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తున్న పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు ఇరిగేషన్ శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుని కోరారు. గురువారం మంత్రిని కలిసి వినతిపత్రం అందించినట్లు పథకం అధ్యక్షులు ముళ్లపూడి రామచంద్రం తెలిపారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకంలో ఎదురవుతున్న లోటుపాట్లను, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ పథకం అభివృద్ధి చేస్తే మండలంలోని అన్నదేవరపేట, పోచవరం, గజ్జరం గ్రామాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎత్తిపోతల పథకం సంఘ సభ్యులు గన్నిన సత్తిబాబు, మండా గోవింద్, ఇతర రైతులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై కొరడా

గ్రీన్, రెడ్, ఆరెంజ్ జోన్‌ల పేరుతో విభజన
ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఇప్పటికే తొలగింపు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నగర పాలక సంస్థ వీధి వ్యాపారులపై కొరఢా ఝులిపించింది. ఓ వైపు ట్రాఫిక్ పోలీసులు, మరోవైపు మున్సిపల్ అధికారుల వేధింపుల మధ్య నలిగిపోతున్న చిరువ్యాపారులపై జోన్‌ల విభజన మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి పొట్ట చేతపట్టుకుని ఉపాధి కోసం వచ్చిన వారు, స్థానిక పేదలు అత్యధిక మంది వీధి వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఇటువంటి వారిని ప్రోత్సహించాల్సిన పాలనా యంత్రాంగం అందుకుభిన్నంగా వ్యవహరించటం విమర్శలకు దారి తీస్తోంది.

గత రెండు రోజులుగా ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వీధులలో వ్యాపారం చేసుకునే సుమారు 100 మందికి పైగా వ్యాపారుల బాటరీ లైట్లు, గ్యాస్ సిలిండర్లు, ఇతరాత్ర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో నగర కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ గురువారం వ్యాపారులు ప్రదక్షిణలు చేశారు. ఇకపై ఆ ప్రాంతాల్లో వ్యాపారం చేయాలనుకుంటే కాలువపై బండ్లు పెట్టుకోవాలని అధికారులు తేల్చిచెప్పారు. అంతటితో ఆగకుండా అపరాధ రుసుములు చెల్లించాలని, చెల్లించినా వెంటనేవారికి తిరిగి వస్తువులు అందజేయలేమని బెదిరించటంతో దిక్కుతోచని స్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు అధికార పార్టీ ఎంఎల్‌ఎ ఇంటి వద్దకు క్యూ కడుతున్నారు. తమ గోడు వెలిబుచ్చుతున్నారు. తమ వస్తువులు తిరిగి ఇవ్వటంతో పాటు, యథాతథంగా వ్యాపారం చేసుకునే వెసులు బాటు కల్పించాలని వేడుకుంటున్నారు.



తన సామగ్రి ఇచ్చేయాలంటూ కార్పొరేషన్ సిబ్బందిని వేడుకుంటున్న చిరువ్యాపారి కాజల్

నగరంలో 8791 మంది చిరు వ్యాపారులు

గత రెండు నెలలుగా నగరంలోని వీధి వ్యాపారాలను నగర కార్పొరేషన్‌లోని మెప్మా విభాగం సర్వే పూర్తి చేసింది. వెండింగ్ సర్టిఫికెట్‌లు, ఐడి కార్డులు కల్గిన వారు ఇప్పటికే నగరంలో 7149 మంది ఉండగా మరో 1642 మంది వ్యాపారులను తాజాగా గుర్తించారు. రాజమహేంద్రవరం నగరంలో తాజా సర్వే ఆధారంగా 8791 మంది వీధి వ్యాపారులు ఉన్నారని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మరో 1500 మంది అదనంగా ఉంటారని అంచనా. దశాబ్దాల కాలంగా రోడ్లు, ప్రధాన కూడళ్లు, జంక్షన్‌లలో కూరగాయలు, పండ్లు, టిఫిన్, దుస్తులు, తదితర వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. రోజువారీ జీవితం గడవడానికి కూడా చాలనంత చిరు సంపాదనతో బతుకుతుంటారు. తోపుడు బండ్లు నిర్వహించుకునే వ్యాపారులకు అద్దెలు గానీ, ఇతర ఖర్చులు గానీ లేకపోవటంతో తక్కువ ధరకు కూరగాయలు ఇతరత్రా సరుకులు అందించగలుగుతారు. అందుకే ప్రజాదరణ లభిస్తుందని సుస్పష్టం. అయితే అధికార యంత్రాంగం ప్రజా సౌకర్యార్థం అంటూ వీధివ్యాపారుల పొట్టకొట్టే ప్రయత్నం జరుగుతోంది.

జోన్‌ల పేరుతో విభజన

. ఈ మొత్తం వ్యాపారులను రెడ్, గ్రీన్, అంబర్ జోన్‌ల పేరుతో 150 జోన్‌లు విభజించారు. సుమారు 59 రెడ్ జోన్‌లలో వీధి వ్యాపారాలు చేసేందుకు ఎటువంటి అనుమతులూ ఇవ్వబోమని అధికార యంత్రాంగం తేల్చిచెబుతోంది. ఆరెంజ్ జోన్‌లో ఉదయం-సాయంత్రం వేళల్లో అనుమతించిన సమయంలోనే వ్యాపారాలు ఇకపై చేసుకోవాల్సి ఉంటుంది. గ్రీన్‌జోన్‌లో యథాతథంగా వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. రెడ్ జోన్‌ల పరిధిలో క్వారీ జంక్షన్, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, జిఎన్‌టి రోడ్డు, దానవాయిపేట, సుంకర కాంప్లెక్స్, దానవాయిపేట చిన్నగాంధీ బొమ్మ వీధి, పోలీసు హెడ్ క్వార్టర్స్ ఎదురు సురుచి జంక్షన్, దానవాయి పేట పార్కుకు ఇరువైపులా, ప్రకాష్ నగర్ పెట్రోల్ బంక్, ఆనంద్ స్వీట్స్, మానస హాస్పిటల్ దగ్గర, అపెక్స్ హాస్పిటల్, ఎపి అప్పారావురోడ్డు పద్మావతి హోటల్ నుంచి రామాలయం వరకూ, నందం గనిరాజు సెంటర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ జోన్‌ల పరిధిలో సుమారు 3 వేలకు పైగా వ్యాపారులు ఉన్నారు. వారంతా ఇకపై ఉపాధికి దూరం కానున్నారు.

జోన్‌ల పేరుతో విభజన



వీధి వ్యాపారుల పొట్ట కొట్టే నిర్ణయాలను కార్పొరేషన్ అధికారులు ఉపసంహరించాలి. దేశంలో అనేక మహానగరాల్లో వీధి వ్యాపారమే ప్రధానంగా జరుగుతుంది. కోవిడ్ అనంతరం అనేక మంది ఉపాధి లేక రోడ్డున పడ్డారు. ఇలాంటి వారి పట్ల జోన్ల పేరిట వారి ఉపాధి దెబ్బకొట్టే విధానాలను తక్షణమే ఆపాలి. నగరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ సరైన పార్కింగ్ కూడా లేకుండా రోడ్లు ఆక్రమిస్తుంటే కార్పొరేషన్ అధికారులు వారి వైపు కూడా చేడటం లేదు. కానీ సామాన్య బడుగు జీవులపై మాత్రం తమ ప్రతాపం చూపడం సరికాదు.

-టి.అరుణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి

వస్తువులు తీసుకెళ్లిపోయారు



ఉదయం నుంచి బోణీ కూడా కాలేదు. గత 5 సంవత్సరాలుగా బెడ్‌షీట్లు, మ్యాట్‌లు, కర్టెన్లు అమ్ముకుంటూ ఉపాధి పొందు తున్నాను. మొత్తం ఆరుగురు కుటుంబ సభ్యులము ఉన్నాము. మా అందరికీ ఈ వ్యాపారం ద్వారానే కడుపు నిండుతోంది. ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేయొద్దన్నారని కొద్దిగా దూరంగా ఏర్పాటు చేసుకున్నాను. అయినప్పటికీ వచ్చి వ్యాపారం చేసేందుకు అవకాశం లేదని చెబుతూనే సుమారు రూ.10 వేలు విలువ చేసే సరుకు తీసుకెళ్లిపోయారు. ఎంత ప్రాధేయపడినా తిరిగి ఇవ్వలేదు.

-కాజల్, చిరు వ్యాపారి, జిఎన్‌టి రోడ్డు, సిటిఆర్‌ఐ

2న రైతుల ఖాతాల్లో రూ.74 కోట్లు జమ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాల ద్వారా జిల్లాలో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.74 కోట్లు జమ కానున్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో రూ.5 వేలు, పిఎం కిసాన్ పథకంలో రూ.2 వేలు మొత్తం ఒక్కొక్క రైతు ఖాతాలో రూ.7 వేలు జమ కానున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు మొత్తం ఏడాదికి రూ.20 వేలను మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఈ విడతలో అన్నదాత సుఖీభవ పథకంలో ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున 1.13 లక్షల మంది రైతులకు రూ.55 కోట్లు, పిఎం కిసాన్ యోజన పథకంలో ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున 1.20 లక్షల మంది రైతులకు రూ.24 కోట్ల మేర రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ నిధులు సకాలంలో అందేందుకు రైతుల బ్యాంక్ ఖాతాలు ఎన్‌పిసిఐ(నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో అనుసంధానమై ఉండటం తప్పనిసరి అని అన్నారు. జిల్లాలో 1,434 ఖాతాలు ఎన్‌పిసిఐ అనుసంధానం కాలేదని, మరో 1,072 ఖాతాలు అనుసంధానమైనా "ఇన్‌ఆక్టివ్"గా ఉన్నాయని తెలిపారు. కనుక రైతులు ఇ-కెవైసి చేసుకోవాలని కోరారు. రైతుల ఖాతాలకి జమ కాకపోవడానికి ఆధార్ కార్డు నెంబర్ తప్పుగా వేరొక ఖాతాకి అనుసంధానం కావడం, ఇ-కెవైసి కాకపోవడం, బ్యాంకు ఖాతా మనుగడలో లేకపోవడం తదితర కారణాలను గుర్తించడం జరిగిందని అన్నారు. సాగు భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చిన వారు, ఆదాయపు పన్ను చెల్లించే వ్యక్తులు, గ్రూప్ డి కాని కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులు రాజ్యాంగబద్ధ పదవులు నిర్వహించిన వారు, నిర్వహిస్తున్న వారు ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఈ పథకాలకు అర్హులు కారని తెలిపారు. నిధుల విషయంలో ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే 155251, వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్: 95523 00003 స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కార్మికుల ఆరోగ్యం, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం నగరంలోని ఇఎస్‌ఐ ఆసుపత్రిలో కార్పొరేట్ సామాజిక బాధ్యతకింద యూనియన్ బ్యాంక్ విరాళంగా అందజేసిన రూ.42 లక్షల విలువైన అత్యాధునిక సౌకర్యాలు (వెంటిలేటర్, మానిటర్, ఇన్‌ఫ్యూజన్, స్ట్రెచర్, ఎసి) కలిగిన అంబులెన్స్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ జీరో ఇన్సిడెంట్ నమోదే ప్రభుత్వ లక్ష్యమని, ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజమహేంద్రవరం ఈఎస్‌ఐ ఆసుపత్రిలో రోజూ 200-300 మంది పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని, కార్మికుల బీమా చెల్లింపులో యాజమాన్యాల నిర్లక్ష్యం ఉంటే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో 150 పడకల సామర్థ్యం గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అమరావతిలో నిర్మించనున్నట్లు తెలిపారు. అంబులెన్స్‌ను అందించిన యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంబులెన్స్‌కు 3 సంవత్సరాల పాటు నిర్వహణ సేవలు, డ్రైవర్, టెక్నీషియన్, స్పెషలిస్ట్ డాక్టర్ లాంటి సదుపాయాలు అందించడం జరిగిందని తెలిపారు. ఇఎస్‌ఐ బెనిఫిషరీ కార్డు కలిగిన కార్మికులకు ఉచిత వైద్య సేవలతోపాటు, దీర్ఘకాలిక అనారోగ్యం పట్ల ఆరు నెలల పాటు జీవనోపాధి భృతి రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎ.విశ్వేశ్వర రావు, ఇఎస్‌ఐ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న వెంకటలక్ష్మి

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలువురికి సిఎం సహాయ నిధి చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ సిఫార్స్‌తో వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన 13 మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలయ్యాయి. గురువారం రఘుదేవపురంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ సతీమణి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కాటవరం గ్రామానికి చెందిన బొల్లి శ్రీలక్ష్మికి రూ.1,40,798, ముగ్గళ్ళ గ్రామానికి చెందిన కూచిపూడి ఉమాదేవికి రూ.1,18,013, కూనవరం గ్రామానికి చెందిన మద్దిరెడ్డి అయ్యప్పకి రూ.లక్ష, ముత్యం రాముకి రూ.50 వేలు, నందూరి ఏడుకొండలుకి రూ.65,904, రావూరి రాముకి రూ.50,011, తలాబత్తుల విజయదుర్గకి రూ.94,158, చినకొండేపూడి గ్రామానికి చెందిన పెరవలి శ్రీనివాస్ కుమార్‌కి రూ.40,918, చిడిపి సుబ్బారావుకి రూ.20,524, దుగ్గిరాల అనంతలక్ష్మికి రూ.15 వేలు, రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఉందుర్తి హరీష్‌కి రూ.36,084, బొబ్బిల్లంక గ్రామానికి చెందిన గుత్తుల శాంతిశిరీషాదేవికి రూ.23,400, సీతానగరం గ్రామానికి చెందిన పెంటా రజితసునీతభవానికి రూ.18 వేలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు

ఏడాది పాలనపై ప్రజల్లో సంతృప్తి : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి - కడియం, కొవ్వూరు

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారిక శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసు అన్నారు. గురువారం కడియంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరితో కలిసి మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం, పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ పథకాలను అందించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని స్త్రీ శక్తి పేరుతో ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్నామని, ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లు నష్టపోకుండా చూస్తామని అన్నారు. ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా 64 లక్షల మందికి పింఛన్లను ఇస్తున్నట్లు తెలిపారు. లిక్కర్ స్కామ్ కేసులో రూ.11 కోట్లు నగదు సీజ్ చేయడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు చెలరేగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వ దుర్మార్గమైన పాలనతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు రావడం లేదన్నారు. అనంతరం మహిళా సంఘాలు తయారుచేసిన వివిధ వస్తువుల స్టాళ్లను వారు తిలకించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసగంటి సత్యవతి, ఎంపిపి వెలుగుబంటిప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మార్ని వాసుదేవ్, నాయకులు డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, ముద్రగడ జెమ్మి, బోడపాటి గోపి, డ్వాక్రా పీడీ ఎన్‌విఎస్.మూర్తి, ఎంపిడిఒ కె.రమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలం మద్దూరులంకలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం పాలన తీరుపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాకర్ల నారాయుడు, మాజీ సర్పంచ్ ఆకుల సత్యనారాయణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



కడియంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి

సీతబాబు కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం



గోకవరం గ్రామానికి చెందిన దాసరి సీతారామయ్య(సీతబాబు) ఇటీవల అకాల మరణం పొందారు. ఈ నేపథ్యంలో గురువారం వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సమన్వయకర్త తోట నరసింహం, మాజీ ఎంఎల్ఎ చిట్బూరి రవీంద్ర, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తోట శ్రీరాంజీ పరామర్శించారు. సీతబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శలో వైసిపి దాసరి చినబాబు, సుంకర రమణ, పాటి రాంబాబు, సుంకర.వీరబాబు, సమ్మెట మోహన్, తోట బాబ్జి, రాంకుర్తి మూర్తి, పాల్గొన్నారు.

165 వితంతు పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని 20 గ్రామాల పరిధిలో నూనతంగా 165 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు అయ్యాయని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ గంటా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు శుక్రవారం ఆయా సచివాలయ పరిధిలో ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో అందజేస్తామన్నారు. ఖండవల్లి వన్-12, ఖండవల్లి టు-2, కొత్తపల్లి అగ్రహారం-8, మల్లేశ్వరం-6, ముక్కామల వన్-11, ముక్కామల టు -6, నడిపల్లి-8, పెరవలి వన్-5, పెరవలి టు-5, పిట్టల వేమవరం-19, తీపర్రు -6, ఉసులుమర్రు-12, అజ్జరం-10, అన్నవరప్పాడు-10, కాకరపర్రు-15, కానూరు వన్-4, కానూరు టు-9, కానూరు అగ్రహారం-7, కాపవరం-6 మొత్తం 165 పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు.

లాభదాయకంగా జీడిపప్పు పరిశ్రమ

ప్రజాశక్తి - కొవ్వూరు

జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమ రాష్ట్రంలో లాభదాయకంగా నడుస్తుందని ఎపి సెరికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. గురువారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని పొలంలో జీడి పండు నుంచి పిక్కలను వేరు చేసే యంత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యంత్రం రోజుకి మూడు వేల కిలోల గింజలను కాయల నుంచి వేరు చేస్తుందన్నారు. 1.2 లీటర్ల పెట్రోల్‌తో గంటకి 300 కిలోల గింజలను ఈ యంత్రంతో వేరు చేయవచ్చునని తెలిపారు. రైతులు సాంప్రదాయ పద్ధతిని అనుసరిస్తే రూ.3వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. ఉద్యాన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్, యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజు, ఎపిఎంఐ పీడీ దుర్గేష్, జిల్లా ఉద్యానవన అధికారి ఎన్.మల్లికార్జునరావు, ఉద్యానవన అధికారి డి.సుధీర్‌కుమార్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు తెలిపారు. గురువారం మండలంలోని సూర్యారావుపాలెంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను రోడ్డుమీద వేయకుండా, ఇంటింటికి వచ్చి సేకరించే పారిశుధ్య సిబ్బందికి చెత్తను తడి, పొడి చెత్తగా వేరువేరుగా అందజేయాలన్నారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని, కావున ఆ ప్లాస్టిక్‌ను వినయోగించరాదని సూచించారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి హిమకిరణ్ పాల్గొన్నారు.

ఎన్‌పిసిఐ లింకు చేయించుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో ఎన్‌పిసిఐ లింకును తక్షణమే చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.గోపాలకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని చిక్కాల గ్రామంలో ఎస్‌బిఐ బ్యాంకులో 43 మంది రైతులకు ఎన్‌పిసిఐ బ్యాంకు ఖాతాలు తెరిపించారు. మొత్తం 129 మంది రైతుల్లో మిగిలిన 86 మందిలో 13 మంది రైతులు మృతి చెందగా, మిగిలిన 73 మంది రైతులు వెంటనే బ్యాంక్ ఖాతాలకు లింక్ చేసుకోవాలని లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు బ్యాంక్ ఖాతాల్లో వర్తించవని అన్నారు. శుక్రవారం లోగా ఎన్‌పిసిఐ లింకును చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మేరికమ్మ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కనీస, హైయర్ పెన్షన్ కోసం నిర్వహిస్తున్న చలో ఢిల్లీ పోరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ రాష్ట్ర జయప్రదం చేయండి. రాష్ట్ర కార్యదర్శి కె.సత్తిరాజు పిలుపునిచ్చారు. గురువారం ధవళేశ్వరంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు ఎస్,సోమేశ్వర రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 11 సంవత్సరాలుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఇపిఎఫ్ పెన్షనర్లు 78 లక్షల మంది ఉన్నారని తెలిపారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఎపిఆర్‌పిఎ డిమాండ్ చేస్తుందన్నారు. ఒకపక్క కార్పొరేట్లకి లక్షల కోట్ల రూపాయలు రాయితీలు కల్పిస్తూ దేశ సంపదకు సృష్టికర్తలైన కార్మికుల కుటుంబాలను వీధుల పాలు చేస్తుందని విమర్శించారు. అయ్యర్ పెన్షన్ అమలులో తీవ్ర జాప్యంతో పాటు, అర్హులైన వారికి హైయ్యర్ పెన్షన్ ఇవ్వడానికి యాజమాన్యాలతో కుమ్మక్కై తిరస్కరించడం దారుణమన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద డిసెంబర్లో జరిగే పోరాట కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మోహన్‌రావు కార్యకలాపాలు నివేదికను ప్రవేశపెట్టి సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు సిహెచ్.ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.రామకృష్ణ, ఎం.విలియం కేరి, జిబి.రాజు, ప్రకాష్, కెవి.రావు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ నేత సత్తిరాజు


కార్టూన్ 'నిజం'



ఎరువుల వాడకంలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

పంట పొలాలకు ఎరువుల వాడకంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నరసింహారావు అన్నారు. గురువారం మండలంలోని డి.ముప్పవరం గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎరువులు, పురుగుమందుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు జె.రామలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను, జీవన ఎరువులను, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం వంటి సహజ ఎరువులను వాడకం ద్వారా నేలను సారవంతం చేసుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు జై రామలక్ష్మి మాట్లాడుతూ రైతులు ఎరువుల వాడకంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను, జీవన ఎరువులను, ఘనజీవామతం, ద్రవ జీవామతం వంటి సహజ ఎరువులను వాడకం ద్వారా నేలను సారవంతం చేసుకోవడమే కాకుండా నేల యొక్క సహజ స్థితిని మరియు నేలలో పెరిగే సూక్ష్మజీవుల అభివద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వనరుల కేంద్రం అధికారులు



మున్సిపాలిటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి కౌన్సిలర్లు

సమావేశం నుంచి వైసిపి కౌన్సిలర్లు వాకౌట్

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం గురువారం మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే అభివృద్ధి పనులకు సంబంధించి రూ.78.50 లక్షలతో ప్రతిపాదించిన పనులలో వైసిపి కౌన్సిలర్లు ఉన్న 13 వార్డులు లేకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తూ, వైస్ ఛైర్మన్ ఎలగడ బాలరాజు, కామిశెట్టి వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో 13 మంది వైసిపి కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ ఎలగడ బాలరాజు మాట్లాడుతూ వైసిపికి చెందిన కౌన్సిలర్స్ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ తమ వార్డుల్లో పనులను ఎజెండాలో పొందుపరచడం లేదని విమర్శించారు. పట్టణంలో అభివృద్ధి పనులు మాత్రం వేగవంతంగా జరుగుతున్నాయని మున్సిపల్ ఛైర్మన్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు-దొమ్మేరు రోడ్డు మార్గంలో యదగిరి నూకరాజుకు చెందిన హోటల్లో చోరీకి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. వీరి నుంచి రెండు గ్యాస్ సిలిండర్లను, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టణానికి చెందిన ఎలుబండి నాగదుర్గ పవన్, ఎర్రంశెట్టి అంజి, దొమ్మేరుకు చెందిన గూడ వణీలను అరెస్ట్ చేశామన్నారు. వీరు కొవ్వూరుతో పాటు సమిస్రగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు మోటార్‌సైకిళ్లను చోరీ చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో నాలుగో వార్డు క్రిస్టియన్ పేటకు చెందిన చింతలపూడి శ్రీనివాస్(56) ఆర్థిక, అనారోగ్య ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గత కొంతకాలంగా శ్రీనివాస్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీనితోడు ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది బుధవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు భార్య శ్రీదేవి గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. మతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి 216పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ నుండి యానం వైపు వెళ్తున్న కారు అమలాపురం నుండి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న మండపాటి సుబ్రహ్మణ్యం (67) అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ సీట్లో ఉన్న ఆమె భర్త మండపాటి శ్రీరామరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రెప్పపాటులో కళ్ల ఎదుటే భార్య మృతి చెందడంతో భర్త శ్రీరామరాజు దిగ్భ్రాంతికి గురయ్యాడు. సంఘటనా స్థలాన్ని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి

మానవతా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - దేవరపల్లి

మానవతా శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం గురువారం కెసిరాజు సీతారామయ్య స్వగృహం వద్ద జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా బండి సూర్యప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా ఆచంట సుభాష్‌చంద్రబోస్, కార్యదర్శిగా కూసంపూడి నరేష్‌వర్మ, సంయుక్త కార్యదర్శిగా కె.రవికుమార్, కోశాధికారిగా తీగల లక్ష్మీనారాయణ, ఇసి మెంబర్లుగా విద్య నలమాటి, లలిత వైద్యం, ఆకుల నాగేశ్వరరావు, నున్న శివరామకృష్ణ, పచ్చ రామగోపాల్‌లను నియమించారు. మండలం నుంచి జిల్లా బోర్డు డైరెక్టర్లుగా బల్ల సూర్యచక్రం, పప్పు వెంకటరామారావు, కురిసేటి రామరాజు ఎంపికయ్యారు. వీరితో జిల్లా కమిటీ నుంచి హాజరైన ఆర్.గంగాధర్‌రావు, కండెపు సూర్యనారాయణ, వి.చంద్రయ్య, కేశిరాజు రాజ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కేసిరాజు సీతారామయ్య, తీగల బలరామయ్య, జొన్న లగడ్డ రాంబాబు, కుక్కల నాగేంద్ర పాల్గొన్నారు.

స్వమిత్వ పథకంపై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వమిత్వ పథకంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్ల పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఒ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆస్తులకు స్పష్టమైన యాజమాన్య హక్కులను కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన ఒక విప్లవాత్మకమైన సర్వే కార్యక్రమం స్వమిత్వ అని అన్నారు. పథకంలో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఉపయోగించ బడతాయని, డ్రోన్లు గ్రామాలలోని ప్రతి ఆస్తిని ఖచ్చితంగా మ్యాప్ చేసి, సరిహద్దులను గుర్తిస్తాయని అన్నారు. ఈ సమాచారం ఆధారంగా ఆస్తి కార్డులు రూపొందించబడతాయని తెలిపారు.

వికలాంగుల హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక బీచ్ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ ఆఫీసులో మల్టీ డిసబిలిటీ ప్రాజెక్టులో భాగంగా వికలాంగుల తల్లిదండ్రులకు వికలాంగుల యొక్క హక్కులు చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.నాయుడు మాట్లాడుతూ బహుళ వైకల్యం కలిగిన వ్యక్తులకు ప్రభుత్వం అనేక రకాల సౌకర్యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వికలాంగుల చట్టం 2016లో ఉద్యోగ అవకాశాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడం, ఉచిత పరికరాలు, ఉచిత విద్య, స్కాలర్‌షిప్ వంటి పథకాలును వివరించారు. మల్టీ డిజేబుల్ ప్రాజెక్టు ద్వారా ఉచితంగా ఇంటి వద్ద ఫిజియోథెరపి, న్యూట్రిషన్ ఫుడ్, ఒకేషనల్ ఆక్టివిటీస్ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ విజయదుర్గ, జి.సుశీల, స్కూల్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్యాంకులు, ఎటిఎంల భద్రతపై సమీక్ష : ఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



సమావేశ:లో మాట్లాడుతున్న ఎస్‌పి నరసింహకిషోర్, ఇతర అధికారులు

జిల్లాలోని వివిధ బ్యాంకులు, ఎటిఎంల భద్రతపై ఎస్‌పి డి.నరసింహకిషోర్ బ్యాంకు అధికారులతో సమీక్షించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో బ్యాంకులు, ఎటిఎంల వద్ద సిసి కెమెరాల ఏర్పాటు, భద్రత పరంగా తీసుకోవలసిన చర్యలపై చర్చింరాఉ. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రతి బ్యాంక్, ఎటిఎంల వద్ద నిర్దేశిత భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. బ్యాంకు విధుల్లో నియమించుకునే తాత్కాలిక సిబ్బంది, ఔట్ సోర్సింగ్ భద్రతా సిబ్బందికి ముందుగా పోలీసు వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు. బ్యాంకు, ఎటిఎంల వద్ద 24 గంటలు పనిచేసే నైట్ విజన్ హెచ్‌డి సిసిటివిలను అమర్చుకోవాలని సూచించారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు నియమించబడిన బ్యాంకు అధికారులకు కాల్ చేసే సౌకర్యంతో కూడిన భద్రతా అలారం వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. సెక్యూరిటీ, ఫైర్ సెక్యూరిటీ పరికరాల పనితీరును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. విడిగా ఉన్న ఎటిఎంలు, బ్యాంకుల వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డును నియమించాలన్నారు. బ్యాంకు, ఎటిఎం చుట్టుపక్కల బీట్ పోలీసులు తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, అడిషనల్ ఎస్‌పిలు ఎన్‌బిఎం.మురళీకృష్ణ, ఎవి.సుబ్బరాజు, ఎల్.అర్జున్, డిఎస్‌పిబ(ఎస్‌బి) బి.రామకృష్ణ, జోనల్ డిఎస్‌పిలు, సిఐలు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

-కలెక్టరేట్‌కు ఇద్దరు విఆర్‌ఒల అటాచ్‌మెంట్‌కు ఆదేశం

ప్రజాశక్తి - రాజానగరం

రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు గురువారం మండలంలోని నందరాడ, నరేంద్రపురం రైతు సేవా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, డేటా ఎంట్రీ తదితర వాటిని పరిశీలించారు. విఆర్‌ఒలు సిహెచ్.మునితిరుపతి, ఎం.సత్యనారాయణ నిర్లక్ష్యంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వీరిని కలెక్టరేట్‌కు అటాచ్మెంట్ చేయాలని తహశీల్దార్ జివిఎస్.దేవిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీన పిఎం కిసాన్ యోజన పథకంలో రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ పథకంలో రూ.5 వేలు మొత్తం రూ.7 వేలను అర్హులైన రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు ఈ-క్రాప్ బుకింగ్ తప్పకుండా చేయించుకోవాలన్నారు. నగదు జమ కావడానికి ఎన్‌పిసిఐ పోర్టల్ ద్వారా ఖాతా లింకింగ్ (ఇ-కేవైసి) ఉండాలని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - పెరవలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని విస్మరిస్తూ పాలన సాగిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీ విమర్శించారు. గురువారం పెరవలి గ్రామంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ- రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం' జరిగింది. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నదని అన్నారు. రాజ్యాంగాన్ని విస్మరిస్తూ పాలన సాగించడం దేశానికి ప్రమాదకరమని అన్నారు. బీహార్ రాష్ట్రంలో ఓటర్ నమోదు ప్రక్రియ రాజ్యాంగానికి విరుద్ధంగా నడుస్తుందని, ఎలక్షన్ కమిషన్ సైతం రాజ్యాంగ పరిధిని దాటి వ్యవహరిస్తుందన్నారు. ఇటువంటి చర్యలు భారత ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయటమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుద్దాన లక్ష్మణరావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జామీర్ రహమాన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అన్వర్ ఖాన్, కాకి కిషోర్, వరప్రసాద్, నాగూర్, రాము తదితరులు పాల్గొన్నారు.



అతిథులకు స్వాగతం పలుకుతున్న నర్సరీ అధినేత పెదసత్యనారాయణ

నర్సరీ అందాలు అద్భుతం

ప్రజాశక్తి - కడియం

కడియం నర్సరీ అందాలు అద్భుతంగా ఉన్నాయని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన కడియపులంక శ్రీ సత్యదేవ(చంటియ్య) నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా పెద సత్యనారాయణ మొక్కనిచ్చి స్వాగతం పలకడంతో పాటు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నర్సరీ రైతులకు ప్రభుత్వ ద్వారా తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నర్సరీ యాక్టును ప్రతి ఒక్కరూ పాటిస్తూ నర్సరీలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు వైఎస్ఆర్ హెచ్‌ఒ డైరెక్టర్ బి.గోవిందరాజు, కొవ్వూరు పరిశోధన క్షేత్రం ప్రిన్సిపల్ డాక్టర్ పి.లలితకుమారేశ్వరి, సీనియర్ సైంటిస్టులు డాక్టర్ రవీంద్రకుమార్, డాక్టర్ వి.శివకుమార్, ఎపిఎంఐపి పీడీ ఎ.దుర్గేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్. మల్లికార్జునరావు, కడియం ఉద్యాన శాఖ అధికారి పి.లావణ్య, స్థానిక నర్సరీ రైతులు గట్టి నరసయ్య, మెర్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

ఎన్‌పిసిఐ ఖాతాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కడియం

రైతులు ఎన్‌పిసిఐ ఖాతాలను వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు ఆదేశజంచారు. గురువారం కడియం కెనరా బ్యాంకును ఆర్‌డిఒ కృష్ణనాయక్‌తో కలిసి ఆయన సందర్శించారు. మండల పరిధిలో ఎన్‌పిసిఐ ఖాతాలు కలిగిన రైతుల వివరాలను ఆయన పరిశీలించారు. తక్షణమే రైతుల ఎన్ఏపిసిఐ ఖాతాలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. మండలానికి సంబంధించి 139 మంది రైతులు బ్యాంక్ అకౌంట్‌లు మనుగడలో లేవని, వారందరూ సరి చూసుకోవాలని, లేకుంటే పోస్ట్ ఆఫీస్‌లలో నూతన అకౌంట్‌లు ప్రారంభించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పి.పద్మలత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తుమ్మలోవ ఫస్ట్ రిఫరల్ యూనిట్ అభివృద్ధికి తగిన ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం తుమ్మలోవ ఫస్ట్ రిఫరల్ యూనిట్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు. వార్డులు, పరికరాలు, రికార్డులు, మందుల నిల్వలు, టెస్టుల నిర్వహణ, అవుట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై చర్చించడం, రికార్డులు నిర్వహణ తీరు పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రాజీ లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కోవిడ్ అనంతరం ఈ యూనిట్ పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడం లేదని, రోగుల సంఖ్య తక్కువగా ఉంటుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సేవలను ఇతర అవసరమున్న ప్రాంతాల్లో వినియోగించేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని మెరుగుపర్చాలని, రోజువారీ పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. ఈ పర్యటనలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌ఒ డాక్టర్ వి.వినూత్న, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీవల్లి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సరిత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మనెల్లి వెంకట్రావుకు పితృవియోగం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చీపురుపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు మనెల్లి వెంకట్రావుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి మనెల్లి ముసలయ్య (80) తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మతితో చీపురుపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గురువారం మధ్యాహ్నం స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, బంధువులు చీపురుపల్లికి తరలివచ్చి మనెల్లి వెంకట్రావును ఓదార్చారు. పలువురు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

2న అన్నదాత సుఖీభవ నగదు జమ

ప్రజాశక్తి - సీతానగరం

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకాలకు అర్హులైన ప్రతి రైతుకు ఆగస్టు 2న రూ.7 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.గౌరీదేవి తెలిపారు. అందులో రూ.2,000 కేంద్రం, రూ.5,000 రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనుందని చెప్పారు. సీతానగరం మండలంలో 6873 మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. అందుకుగాను మండలానికీ 4 కోట్ల 81 లక్షల రూపాయల నగదు రైతులు ఖాతాల్లో జమ కానున్నాయి.

అత్యున్నతమైనది ఉపాధ్యాయ వృత్తి

ప్రజాశక్తి - తాళ్లపూడి



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎంఇఒ

ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదని ఎంఇఒ సిహెచ్.బాలామణి అన్నారు. గురువారం మండలంలోని వేగేశ్వరపురం కెవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పి.సుభాషిణి పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భ:గా ఆమెను పాఠశాల ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఏ వృత్తిలోనూ దక్కని గౌరవం ఉపాధ్యాయ వృత్తిలోనే దక్కుతుందన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టడంతోపాటు, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి దోహదం చేస్తుందన్నారు. సన్మాన గ్రహీత సుభాషిణి మాట్లాడుతూ గత 38 సంవత్సరాలుగా విద్యార్థులకు చదువు నేర్పుతూ వారి మధ్య గడపడం ఎంతో ఆనందాన్ని మిగిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసవి, సుబ్బలక్ష్మి, క్షేమకుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు డి.దుర్గారావు, పూర్వపు విద్యార్థులు వి.సూర్యనారాయణ, ఎ.దేవిడ్‌రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉండ్రాజవరం 33/11 కెవి పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, చెట్లు కొమ్మలు కొట్టే నిమిత్తం శుక్రవారం చివటం, కర్రావారిసావరం 11 కెవి ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలంగి, చివటం, కె.సావరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం కలుగుతుందని అన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకూ, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. **పెరవలి** మండలంలోని 33/11 కెవి మల్లేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని నారాయణ అప్పారావు తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్‌ను సరఫరా చేస్తామని తెలిపారు. **నిడదవోలు** నిడదవోలు 11 కెవి పరిధిలో నిడదవోలు-1 ఫీడర్‌లో ఆర్‌ఒబి పనుల నిమిత్తం పట్టణంలో గాంధీ బొమ్మ సెంటర్, రైల్వే గేట్, సురుచి మెస్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నారాయణ అప్పారావు తెలిపారు. అలాగే 11 కెవి నిడదవోలు టౌన్-2 ఫీడర్ మరమ్మతులు, ట్రీ కటింగ్ నిమిత్తం అమ్మ హాస్పిటల్, గణపతి సెంటర్, ఆక్సిస్ బ్యాంకు ఏరియా, ఎర్నగూడెం రోడ్, శాంతినగర్, వైఎస్ఆర్, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. **రాజానగరం** మండలంలోని పల్లకడియం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాజానగరం, కానవరం, నందరాడ, మల్లంపూడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ జెపిబి నటరాజ్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధితోపాటు బ్రిడ్జి చింటీ, గైట్ ఇంజనీరింగ్ కళాశాల, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 3 గంటలకు విద్యుత్ సరఫరా జరుగుతుందని చెప్పారు. **గోపాలపురం** మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎడిఒ రవిశంకర్ గురువారం తెలిపారు. 33/11 కెవి గోపాలపురం సబ్ స్టేషన్, 11 కెవి గోపాలపురం రూరల్ ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు చేయను న్నట్లు తెలిపారు. గోపాలపురం, వేలచింతలగూడెం, బీమోలు గ్రామాల్లో ఉదయం 8 గంల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 6 గంటల వరకూ సరఫరా చేస్తామని తెలిపారు.

రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - చాగల్లు



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మండలంలోని కలవలపల్లి గ్రామంలో ముళ్ళపూడి మురళీకృష్ణ రైతు పొలంలో రైతులకు అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సులో ఉద్యానవన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, వైఎస్ఆర్ హెచ్‌యు ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజు పాల్గొన్నారు. మల్లపూడి మురళీ పొలంలో మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క, ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. జాజికాయ, దాల్చిన చెక్క సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఎపిఎంఐపి పీడీ దుర్గేష్, జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు, శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారి డి.సుధీర్‌కుమార్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ బాధితులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నిడదవోలు



బాధితునికి కిట్లు అందిస్తున్న నిర్వాహకులు

జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్.ఫైయాజ్ అన్సారీ ఆధ్వర్యంలో క్షయ బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. బాధితులకు కల్లి పరీక్షలు, ఎక్సరే పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫైయాజ్ అన్సారీ మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరారు. బాధితులకు సరైన చికిత్స తీసుకోకుండా ఉంటే అతని ద్వారా మరొకరికి సోకే అవకాశం ఉందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి తగ్గడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే కల్లె పరీక్ష చేయించుకోవాలని సూచించారు. టిబి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ సర్వరాయ షుగర్స్ లిమిటెడ్ నిక్షయ్ మిత్రగా టిబి బాధితులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎస్‌ఆర్. పోతురాజు, ఐసిటిసి కౌన్సిలర్ ప్రమోద, ఎం.రాంబాబు, ఎల్‌టి.రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పుష్పకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సీమంతాలు

ప్రజాశక్తి - రాజానగరం



సీమంతాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక మాధవి ఫంక్షన్‌లో 216 మంది గర్భిణులకు సీమంతాలు చేసి పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, చీర, రవిక, పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ్‌చక్రవర్తి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ రెడ్డి ఇంద్రజ, డాక్టర్ జి.రామ్‌భాస్కర్ అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాస నిపుణురాలు వేణుశ్యామల సంరక్షణ వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా, ఇమ్మన్ని వెంకట్, కార్యదర్శి నింపి రఘనాథరాజు, సహాయ కార్యదర్శి డి.నవీన్‌ప్రసాద్, ప్రోగ్రాం డైరెక్టర్ ఎస్.ధనరాజ్ పాల్గొన్నారు.

187 మందికి నూతన పింఛన్లు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నూతనంగా 187 మంది వితంతువులకు పింఛన్లు మంజూరయ్యాయి. శుక్రవారం వీరిందరికీ పింఛన్లను అందజేయనున్నారు. బొబ్బిల్లంకలో 16, చిన్నకొండేపూడిలో 15 ఉండేశ్వరపురం 10, ఇనగంటివారిపేట 11, కాటవరం 6, కూనవరం 8, మిర్తిపాడు 4, ముగ్గళ్ళ 12, మునికూడలి 7, నాగంపల్లి 6, పురుషోత్తపట్నం 8, రఘుదేవపురం వన్ 9, రఘుదేవపురం టు 12, రఘుదేవపురం త్రీ 16, సీతానగరం వన్ 8, సీతానగరం టు 12, సింగవరం 9, వంగలపూడి 8 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు అయ్యాయి.

క్రీడా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు క్రీడా పరికరాల కిట్టును అందజేశారు. గురువారం పూర్వవిద్యార్థులు చిక్కం దొరబాబు రూ.5,116, దవులూరి బ్రహ్మాజీ నాయుడు రూ.5 వేలు మొత్తం పదివేల విలువ చేసే క్రీడా పరికరాల కిట్టును పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు చేతుల మీదగా హెచ్‌ఎం కె. అబ్బులుకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుని పురపాలక సంఘం

ఆర్.ఒ.సి. నెం.388/2017/ఇ1 **తేదీ.31-07-2025**

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

తుని పురపాలక సంఘము నందు 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి 2 పనులు మరియు సాధారణ నిధుల నుండి 3 పనులు చేపట్టి పూర్తిచేయుటకు సంబంధించిన "ఇ" ప్రొక్యూర్‌మెంటు ప్లాట్‌ఫారంపై టెండరు ఆహ్వానించడమైనది. సదరు టెండరుకు సంబంధించిన ఇతర వివరములు ది. 01-08-2025 ఉదయం గం॥ 11.00 నుండి www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సంప్రదించవలసిన చిరునామా: కమిషనరు, తుని మున్సిపాలిటీ, ఫోన్ నెం. 9849905806, 08854-253506, e-mail: tunimunicipality@gmail.com

సం/- **ఎ.వెంకటరావు**
కమిషనరు, తుని పురపాలక సంఘం

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, గోపవరం గ్రామ కాపురస్తులు యండపల్లి రామమోహనరావు, తండ్రి: సత్యనారాయణ అనే నాకు గోపాలపురం మండలం, గంగోలు రెవిన్యూ గ్రామంలో ద.నెం. 736/06 ద్వారా ఆర్.యస్. నెం. 783 రులో య. 0-99 ట్లు భూమి మరియు ద.నెం. 737/06 ద్వారా ఆర్.యస్. నెం. 783 రులో య. 0-51 సెంట్లు భూమి కలవు. సదరు దస్తావేజు పోలవరం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు నందు రిజిస్టర్ చేయబడినవి. ఈ భూమి తాలూకు ఒరిజినల్ దస్తావేజులు తీసుకుని మా ఇంటి దగ్గర నుండి బయలుదేరి గోపాలపురం తహశీల్దారు ఆఫీసుకు ది. 24-07-2025వ తేదీన తీసుకుని వెళ్ళి అక్కడ పని ముగించుకుని తిరిగి మా ఇంటికి వచ్చుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ అడ్రసుకు, ఫోన్ నెంబరుకు తెలియచేయగలరు.

యండపల్లి రామమోహనరావు
తండ్రి: సత్యనారాయణ, డో.నెం. 2-150
పంచాయతి ఆఫీసు, సగ్గొండ
గోపవరం, గోపాలపురం మండలం
సెల్: 9030783957

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 138/2016

బిట్వీన్:
ఎన్.శేషగిరిరావు తరుపున జి.పి.ఎ హోల్డర్ ఎన్.శ్రీనివాస్ **-వాదులు**
అండ్
సంకు వెంకటేశ్వరరావు అండ్ అదర్స్ **-ప్రతివాదులు**

D-10: సంకు కిషన్, S/o. వెంకటేశ్వరరావు, 40 సం॥లు, ఉద్యోగి, డో.నెం. 2-48, గోరసపాలెం, తొండంగి మండలం, PTPJCJ.

పై నెంబర్ దావాలో మీరు నోటీసు తీసుకోనందున శ్రీ కోర్టు వారు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీస్‌గా పేపర్‌లో వేయడం ద్వారా మీకు నోటీసు ఆర్డరు వేసినారు. దావా వాయిదా **ది. 05-8-2025 వేసినారు.** కావున మీరు గాని, మీ అడ్వకేట్ గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలియచేయవలెను. లేని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు చెప్పబడును.

బత్తిన లక్ష్మణదొర, అడ్వకేట్
పిఠాపురం, సెల్: 9848184474